తుఫాన్ దెబ్బకు రైతులు ఉక్కిరిబిక్కిరి

- తీరంలో భారీగా ఈదురుగాలులు
- ధాన్యం ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నం


నరసాపురం రూరల్: రాజుల్లంకలో ధాన్యపురాశి వద్ద నీరు నిలవకుండా బోదె చేసుకుంటున్న రైతు


మొగల్తూరు: నక్కావారిపాలెంలో నేలరాలిన చేను


నరసాపురం రూరల్: సారవలో ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభం

నరసాపురం రూరల్: బంగాళాఖాతంలో అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారి మరింత బలపడటంతో ఆ ప్రభావం తీరప్రాంతంపై కనిపించింది. ఈ నేపథ్యంలో శనివారం నరసాపురం తీరంలో ఒక్కసారిగా వాతావరణం చల్లగా మారి ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని పలు ప్రాంతాల్లో కోతకోసిన వరి పంటను ఒబ్బిడి చేసే పనుల్లో రైతులు తలమునకలయ్యారు. తుఫాన్ ప్రభావంతో మధ్యాహ్నం 4 గంటల ప్రాంతం నుంచి నరసాపురం మండలంలోని పలు గ్రామాల్లో విపరీతమైన గాలులు వీయడంతో పలు పంటచేలు నేలకొరిగాయి. సారవ గ్రామంలోని ప్రధాన రహదారిలో రెండు చోట్ల విద్యుత్ స్తంబాలు రోడ్డుపై పడిపోయాయి. దీంతో ఆగ్రామంలో రాత్రి వరకూ విద్యుత్ పునరుద్ధరించకపోవడంతో చీకట్లు అలముకున్నాయి. సార్వా సాగు ప్రారంభంలో కూడా వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో నరసాపురం మండలంలో ఈ ఏడాది పెద్దగా వరిసాగు చేపట్టలేదు. సాగు చేసిన కొద్దిపాటి భూములు కూడా పంట చేతికి వచ్చే తరుణంలో కురుస్తున్న ఈ తుఫాన్ దెబ్బకు చేతికి రాకుండా పోతుందని రైతాంగం ఆందోళన చెందుతున్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: ఫెంగల్ ప్రభావంతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శనివారం ఉదయం నుంచి వర్షం, ఈదురు గాలులతో రైతులు ఉరుకులు , పరుగులు తీస్తున్నారు. రాశులమీద బరకాలు కప్పుకొని ధాన్యాన్ని రక్షించుకోవడంలో నిమగ్నమయ్యారు. వరికోతలకు తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. అయితే, శనివారం వీచిన ఈదురు గాలులో కొన్ని ప్రాంతాల్లో వరిచేలు నేల నంటాయి. ముఖ్యంగా స్వర్ణ రకం నేలనంటడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రెండు మూడు రోజుల పాటు నేలనంటి ఉంటే మొలకలు వచ్చే అవకాశం స్వర్ణలో ఎక్కువగా ఉండడంతో ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే రెండు తుపాన్లు, వరదల ప్రభావంతో ఆచంట, పెనుగొండ మండలాల్లో రైతులు అధిక పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది, చేతికందిన పంట మిల్లులకు చేర్చుకొనే తరుణంలో వాతావరణ మార్పులు, వర్షంతో అతలాకుతలమవుతున్నారు. ఆచంట నియోజకవర్గంలోని ఆచంట మండలంలో 10015 ఎకరాల్లోనూ, పోడూరు మండలంలో 12790 ఎకరాల్లోనూ, పెనుగొండ మండలంలో 11750 ఎకరాల్లోనూ, పెనుమంట్ర మండలంలో 12156 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వీటిలో ఇప్పటి వరకూ 25 శాతం వరకూ కోతలు పూర్తయ్యాయి. అయితే, ధాన్యం ఎక్కువగా కల్లాల్లోనే ఉండడంతో నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉంది.

మొగల్తూరులో..

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి ఫెంగల్ తుఫాన్‌గా రూపాంతరం చెందడంతో గత రెండు రోజులుగా మబ్బులతో కూడిన చిరుజల్లులు పడుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ వీచిన ఈదురు గాలలకు మొగల్తూరు, రామన్నపాలెం గ్రామాల్లో కోతకు వచ్చిన చేలు నేల రాలాయి. శనివారం మధ్యాహ్నం నుంచి వర్షం కురవడం ప్రారంభమైంది. దీంతో మొగల్తూరులోని పలు పల్లపు ప్రాంతాలతో పాటు కేపీ పాలెం, కాళీపట్నంలోని పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోయింది. మరోవైపు కోసిన వరి పనలను ఒబ్బిడి చేసుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంరైతులు కోసిన పనలను చేలల్లో నుండి గట్టుకు చేర్చి బరకాలు కప్పుతున్నారు.


పెనుగొండ: ఆచంటలో బరకాలతో ధాన్యాన్ని కాపాడుకుంటున్న రైతన్నలు


పెనుగొండ: తూర్పుపాలెంలో నేల కొరిగిన వరిచేలు


మొగల్తూరులో వర్షం కురుస్తున్న దృశ్యం

క్లుప్తంగా

డ్రగ్స్‌రహిత రాష్ట్రమే లక్ష్యం


విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్

పాలకొల్లు సెంట్రల్: ప్రతి పౌరుడూ ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యంగా పనిచేయాలని పట్టణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల విద్య అంటే ఆకర్షణీయమైన టీనేజీ వయస్సని ఈ వయస్సులో విద్యార్థి క్రమశిక్షణ, ఏకాగ్రతతో మెలగాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ అనుకున్న లక్ష్యం సాధించడానికి ప్రతి విద్యార్థి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై మహేష్, ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి, ఎక్సైజ్ సిబ్బంది కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి


కొవ్వూరి వేణుమాధవ రెడ్డి

పెనుగొండ: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని సత్వరం విరమించుకోవాలని వైఎస్సార్ సీజీ రాష్ట్ర యువజన కార్యదర్శి కొవ్వూరి వేణుమాధవ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పెనుగొండలో విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలు పెంచబోమని ఊదరగొట్టిన చంద్రబాబు, ఆరు నెలల్లో రెండు సార్లు చార్జీల మోత వేసి రూ.15,486 కోట్లు భారం మోపారన్నారు. విద్యుత్ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిన ఘనత బాబుదే నన్నారు. ఇప్పటికే దారుణంగా మండుతున్న నిత్యావసర ధరలు బాదుడితో సామాన్యుడి బతుకు భారంగా మారిందన్నారు. గాడి తప్పిన పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ తరుణంలో విద్యుత్ భారం ప్రజలపై మోపడం సరికాదన్నారు. విద్యుత్ చార్జీలు పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

హక్కులను వినియోగించుకోవాలి


జాతీయ మానవహక్కుల సభలో పాల్గొన అధికారులు

యలమంచిలి: భారత రాజ్యాంగం దేశపౌరులందరికీ సమాన హక్కులను కల్పించిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ పూడి డేవిడ్‌సన్ కోరారు. మేడపాడు కలెక్టర్ వీధిలోని ఎస్సీ కమ్యూనిటి హాలులో శనివారం నిర్వహించిన జాతీయ మానవహక్కుల సభలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం కుల, మతాలకు అతీతంగా స్త్రీ, పురుషులందరికీ హక్కులు ఉన్నాయన్నారు. ఏ వ్యక్తి హక్కులకు భంగం కలిగిన అధికారుల దృష్టి తీసుకువస్తే న్యాయం చేస్తామన్నారు. ప్రజలకు ఈ విషయాలను వివరించడానికే ప్రతి నెలా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటా శాంతకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ గుబ్బల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు పయనమైన మాలధారులు


శబరిమల బయలుదేరిన అయ్యప్ప మాలధారులు

యలమంచిలి: మండలంలోని మేడపాడు గ్రామంలో గురుస్వామి గుర్రాల వెంకట్రావు పీఠంలో అయ్యప్పమాల ధరించిన 21 మంది స్వాములు మండల దీక్ష ముగించుకుని శబరిమల బయలుదేరారు. స్థానిక అయ్యప్ప దీక్షా మందిరం వద్ద స్వాముల ఇరుముడుల కార్యక్రమం శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా మండల దీక్ష ముగించుకున్న స్వాములంతా పీఠంలో సత్యనారాయణస్వామి వ్రతం, గణపతి హోమం నిర్వహించారు. ఇరుముడుల అనంతరం స్వాములకు, వారి బంధువులకు మాజీ ఉప సర్పంచ్ గంధం సత్యకీర్తి ఇంటి వద్ద బిక్ష ఏర్పాటు చేశారు. శబరిమల వెళ్లిన వారిలో గురుస్వాములు గంధం బాలబాలాజీ, వల్లభు గణేశ్వరరావు, పిండి శ్రీనివాసరావు, గంధం వెంకటేశ్వరరావు, వీరవల్లి విక్రమ్, కొప్పినీడి శ్రీనివాసరావు, తాడాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి


మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు

మొగల్తూరు: మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కై లా సుబ్బారావు కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ డి.మోహనరావు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ రూ.7 కోట్లతో గ్రామాల్లో పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. మండలంలో మూడు భారీ మంచినీటి ప్రాజెక్టుల్లో మరమ్మత్తు పనులు పూర్తి చేశామని, రాబోయే రోజుల్లో పూర్తి స్థాయిలో తాగునీరు అందిస్తామన్నారు. మండలంలోని పలు అంగన్ వాడీ కేంద్రాల్లో తాగునీరు సదుపాయం లేదని అధికారుల దృష్టికి వచ్చిందని ఆయా కేంద్రాలకు కుళాయి కనెక్షన్‌లు ఇస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయాధికారి అబ్దుల్‌రహీమ్ మాట్లాడుతూ ఫెంగల్ తుఫాన్ కారణంగా రైతులు కోతకు వచ్చిన చేలు కోయవద్దని ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించామన్నారు. సమావేశంలో రెండో వైస్ ఎంపీపీ కవురు సీతామహాలక్ష్మీ, ఎంపీడీఓ త్రిశూలపాణి, తహసీల్దార్ కె.రాజ్ కిశోర్, డీటీ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు


ఉగ్రనరసింహుని అలంకరణలో ఉన్న వెంకన్న


మొగల్తూరు పూజలు చేస్తున్న అర్చకులు

నరసాపురం రూరల్: మండలంలోని కాపులకొడప వేంకటేశ్వరస్వామివారు శనివారం ఉగ్రనరసింహ స్వామి అవతారంలో దర్శనమిచ్చారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని అలంకారప్రియుడైన ఇక్కడి స్వామివారిని ప్రతి వారం వివిధ రకాల అలంకరణలతో తీర్చిదిద్దడం పరిపాటి. ఈ సందర్భంగా స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు. భక్తుల ఆర్థిక సహకారంతో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: కార్తీకమాసం ఆఖరి శనివారం కావడంతో స్థానిక వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. వేకువ జాము నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు ధ్వజస్తంభం వద్ద దీపాలు వదిలారు. ఆలయ అర్చకులు గంగ పవన్ స్వామి వారిని పూలు తులసిమాలలతో అలంకరించి పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాన్ని అందించారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన


కళాశాల విద్యార్థినులతో క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఎయిడ్స్ అనేది అంటువ్యాధి కాదని వ్యాధి సోకిన వారు వైద్యులను సంప్రదించి సలహాలు పాటించాలని డాక్టర్ అనుపమ తెలిపారు. శనివారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ రెడ్ రిబ్బన్ క్లబ్, వైనైటెడ్ కాపు వనిత క్లబ్ సంయుక్త నిర్వహణలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనుపమ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి సోకిన వారు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, రీల్ మేకింగ్, పోస్టర్ ప్రజెంటేషన్, డిబేట్, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, క్లబ్ అధ్యక్షురాలు వై.విజయలక్ష్మి, కళాశాల అధ్యాపకులు డాక్టర్ మణిమాల, నోబుల్ రాజ్, సంధ్య, జూలియా, మహాలక్ష్మి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో స్వయం ఉపాధి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

పెనుగొండ: సాంకతిక విద్యను అభ్యసించడం వల్ల ఉపాధి అవకాశాలు మెండుగా ఉండడంతో పాటు, స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంటుందని, ఐఎంసీ చైర్మన్, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. శనివారం ఆచంట ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన తొలి ఐఎంసీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సాంకేతిక రంగంలో అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. ఐటీఐ వంటి డిప్లోమా కోర్సులు అభ్యసించడం ద్వారా విద్యార్థులు లక్ష్యాన్ని నేరుగా చేరుకోవచ్చునన్నారు. ఐటీఐ ద్వారా ఉన్నత విద్యాభ్యాసం వైపు దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఐటీఐకి సొంత స్థలం ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లా కలెక్టర్, స్థానిక శాసన సభ్యుడు పితాని సత్యనారాయణలతో కలిసి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో ఉపాధి శిక్షణ శాఖ ఆర్‌జేడీ జోన్–2 మధు శ్రీనివాస్ రావు, ఐఎంసీ సభ్యులు గాజుల బులిపుల్లారావు, దొడ్డిపట్ల సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ పరసా వెంకట శ్రీధర్, ట్రైనింగ్ ఆఫీసరు ఇందుకూరి వెంకట సత్యనారాయణ రాజు, పిల్లా ఆనందబాబు, సిరిపురపు భాను ప్రసాద్, సూపరింటెండెంట్ జీఎల్ఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగులకు సత్కారం

భీమవరం: పోలీసుశాఖలో సుదీర్ఘకాలం ప్రజలకు వెలకట్టలేని సేవలందించిన సిబ్బంది పదవీ విరమణ అనంతరం శేష జీవితం మంచి ఆరోగ్యంతో ఆనందంగా గడపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. భీమవరం సీసీఎస్ ఎస్ఐగా పనిచేసిన లక్ష్మణ్‌కుమార్, డీసీఆర్‌బీ ఎస్ఐ వి వరప్రసాద్, పెనుగొండ పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసిన సూర్యారావులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా డిపార్ట్‌మెంట్‌కు వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి భీమారావు, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి పుల్లారావు, డీసీఆర్‌బి ఇన్‌స్పెక్టర్ దేశింశెట్టి వెంకటేశ్వరరావు, పోలీసు అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ సీహెచ్ మోజేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయాలు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రత్యేక కౌంటర్ల ద్వారా పామాయిల్, ఉల్లిపాయలు విక్రయించేందుకు చర్యలు చేపట్టినట్లు పౌర సరఫరాల అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పామాయిల్ 850 గ్రాముల ప్యాకెట్ రూ.110, ఉల్లిపాయలు కిలో రూ.50 చొప్పున విక్రయిస్తామన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల వద్ద రైస్ కార్డు నెంబర్ తెలియచేసి, క్యూ ఆర్ కోడ్‌ను స్కానం చేయాలన్నారు. తద్వారా మొబైల్‌కు వచ్చే ఓటీపీని కౌంటర్ వద్ద తెలియజేసి మూడు పామాయిల్ ప్యాకెట్లు, ఒక కిలో ఉల్లిపాయలు పొందవచ్చన్నారు. కందిపప్పును కూడా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు పంపిణీ చేస్తామన్నారు.

పొలాల్లో అధికారుల పర్యటనలు


పాలకొల్లు అర్బన్: ఆగర్రులో రైతులతో మాట్లాడుతున్న ఏఓ కె.రాజశేఖర్


పెనుగొండ: కొడమంచిలిలో బరకాలు కప్పకోవాలంటూ సూచనలు చేస్తున్న అధికారులు


నరసాపురం రూరల్: వరికోతకు తొందర పడవద్దని రైతులకు సూచిస్తున్న అధికారులు

పాలకొల్లు అర్బన్: సార్వా మాసూళ్లు చేసుకునే రైతులకు ఫెంగల్ తుఫాన్ గుబులు రేపుతోంది. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ సార్వా మాసూళ్లు చురుగ్గా సాగుతున్నాయి. అయితే మండలంలోని ఆగర్తిపాలెం, వెలివెల, లంకలకోడేరు గ్రామాల్లో ఏఓ కె.రాజశేఖర్ పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలోని 1800 ఎకరాలకు సంబంధించి 5వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించారని ఆయన తెలిపారు. 200 ఎకరాల్లో సార్వా ధాన్యం కల్లాల్లో ఉందని, ధాన్యం తడవకుండా బరకాలు కప్పుకుని రైతులు జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ఒకవేళ ధాన్యం తడిస్తే మొలకలు రాకుండా ధాన్యం పనల మీద, ధాన్యం రాసులపైనా ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని ఏవో సూచించారు. మండలంలోని ఆగర్రు, ఆయన పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు.

అధికారుల అప్రమత్తం

పెనుగొండ: మండలంలో తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో శనివారం అధికారులు అప్రమత్తమయ్యారు. తహసీల్దారు జి.అనితకుమారి, ఆచంట తహసీల్దారు జి.కనకరాజు, పోడూరు తహసీల్దారు ఫాజిల్, ఆయా మండలాల వ్యవసాయాధికారులు పి.స్పందన, బి.నాగరాజు, జి.సత్యనారాయణ తదితరులు పెనుగొండ, కొడమంచిలి, కవిటం జిన్నూరు గ్రామాల్లో కల్లాల్లోని ధాన్యాన్ని రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు. సత్వరం మిల్లులకు చేర్చుకొని 48 గంటలల్లో నగదు పొందాలని సూచించారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: మండలంలో కొన్ని చోట్ల ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. వ్యవసాయ శాఖ ఏడీఏ ఈదా అనిలకుమారి, ఏఓ జాన్‌సన్ తదితరుల నేతృత్వంలో బృందాలుగా ఏర్పడి శనివారం గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఏడీఏ రైతులతో మాట్లాడుతూ కోత కోసిన రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాని సూచించారు. అలాగే అధిక వర్షాలు ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ సూచిస్తున్న నేపథ్యంలో రైతులంతా తమ వద్ద ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.

తెలగ, కాపు వనసమారాధన వాయిదా

నరసాపురం రూరల్: తుఫాన్ కారణంగా ఆదివారం నిర్వహించ తలపెట్టిన తెలగ, కాపు వనసమారాధన వాయిదా వేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. వాతావరణం అనుకూలించని కారణంగా వనసమారాధన వాయిదా వేస్తున్నామని, తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని వారు పేర్కొన్నారు.

వేగంగా పింఛన్ల పంపిణీ

మొగల్తూరు: ప్రతి నెలా అందించే సామాజిక పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని 93 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ సీహెచ్ త్రిశూల పాణి శనివారం విలేకరులకు తెలిపారు. మండలంలోని 10,886 పింఛన్‌దారులకు గానూ 9820 మందికి పింఛన్లను అందించామన్నారు. పింఛన్ తీసుకోని లబ్ధిదారులు ఎవరైనా ఉంటే 2వ తేదీ సోమవారం పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

వానరం స్వైర విహారం


కుక్కను ఎత్తుకెళ్లి అక్కున చేర్చుకున్న పండుకోతి

నరసాపురం రూరల్: మొగల్తూరులో శనివారం ఓ వానరం స్వైర విహారం చేసింది. గ్రామంలోని కోట ప్రాంతంలో రోడ్డుపై సంచరిస్తున్న కుక్క పిల్లను ఎత్తుకెళ్లి అక్కున చేర్చుకుంది. గ్రామంలోని కోట, గోడావారిపేట, నాగదేవత ఆలయం తదితర ప్రాంతాల్లో శుక్రవారం కూడా వానరం స్వైర విహారం చేసిందని ఆయా ప్రాంతాల్లో పిల్లి, కుక్క పిల్లలను ఎత్తుకెళ్లిందని స్థానికులు గొల్లగూడెం ప్రాంతంలో కూడా స్వైర విహారం చేసి మేకలు, గొర్రెలు, కోళ్ల పైనా దాడి చేస్తుందని వాపోతున్నారు. నివాసాల మధ్య వానరం సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా యూటీఎఫ్ ప్రచారం

మొగల్తూరు: పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బి.గోపిమూర్తి గెలుపును కోరుతూ శనివారం యూటీఎఫ్ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండలంలోని 16 మంది యూటీఎఫ్ కార్యకర్తలు మండలంలోని 10 ఉన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు నమూనా బ్యాలెట్‌లు అందించి విజయాన్ని చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతి, కృష్ణకుమారి, చింతపల్లి కృష్ణమోహన్, ఉషా మాధవి, దొంగ చింతయ్య, శ్యాంబాబు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి


టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం: తుపాను ప్రభావం దృష్ట్యా రైతులు రాబోయే రెండు రోజుల్లో వరి కోతలు వాయిదా వేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షితమైన ప్రాంతాలకు తరలించుకోవాలని సూచించారు. ధాన్యం తడిస్తే మొలకరాకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రం ద్వారా కనీస మద్దతు ధరపై తేమ శాతానికి అనుగుణంగా ధాన్యాన్ని అమ్ముకోవడానికి వీలు కల్పించామని తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని నెంబర్లు 8121676653/ 18004251291 కి కాల్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.

వ్యక్తిపై దాడి

భీమవరం: మోటార్ సైకిల్‌పై ఎందుకు అంత వేగంగా వెళుతున్నారని ప్రశ్నించిన వ్యక్తిపై దాడి చేసినట్లు భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఎ.సుబ్రహ్మణ్యం శనివారం ఫిర్యాదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్ఐ వి.వి.ఎస్ కృష్ణాజీ చెప్పారు. హౌసింగ్ బోర్డు కాలనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం శుక్రవారం రాత్రి ఆర్టీసీ డిపో దగ్గర రోడ్డుపై నిలబడి ఉండగా నలుగురు వ్యక్తులు రెండు మోటార్ సైకిళ్లపై వేగంగా వెళుతుంటే ప్రశ్నించిన సుబ్రహ్మణ్యంపై దాడి చేసినట్లు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.